క్లుప్తంగా

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

సైదాపూర్: బీజేపీ నుంచి బారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ హుస్నాబాద్ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. 29న హుస్నాబాద్‌లో నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బీజేపీ పదేండ్ల పాలనలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చారని, ఈ సారి గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని, రిజర్వేషన్లు తొలగిస్తామని చెబుతున్న బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి బహుజన సమాజం సిద్ధం కావాలని కోరారు. గత ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేస్తే బీజేపీ ప్రభుత్వం ప్రజలను దోచి సంపన్నుల కొమ్ము కాస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, వేముల జగదీష్, గొల్లపల్లి రాజయ్య, గొల్లపల్లి కనుకయ్య, ముజ్జిగ పద్మయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

'రుణమాఫీపై బీఆర్‌ఎస్‌కు మాట్లాడే అర్హత లేదు'

సైదాపూర్: పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్‌ఎస్ నాయకులకు రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేసిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేస్తేనే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, పదవి ఊడిపోయేవరకు రుణమాఫీ చేయని బీఆర్‌ఎస్ నాయకులు రుణమాఫీ చేయాలంటూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఓ వైపు ఎన్నికల కోడ్ ఉండగానే రుణమాఫీ చేస్తలేరని ఆరోపించడం సరికాదన్నారు.

మండల సభ వాయిదా

ఇల్లందకుంట: మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ సరిగొమ్ముల పావని అధ్యక్షతన జరగాల్సి ఉండగా సమావేశానికి ఎంపీపీ మినహా ఎంపీటీసీలు హాజరుకాలేదు. కోరం లేక సమావేశం వాయిదా వేశామని త్వరలోనే మరో తేదీన సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి ఎంపీడీవో పుల్లయ్య, అన్నిశాఖల అధికారులు హాజరయ్యారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం రద్దు చేసినట్లు ఎంపీడీఓ నర్సయ్య తెలిపారు. ఎంపీటీసీలు హాజరు కానందున సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

బీఆర్‌ఎస్‌కు కొండపల్కల మాజీ సర్పంచ్ రాజీనామా

మానకొండూర్: మండలంలోని కొండపల్కల మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నల్లా వంశీధర్‌రెడ్డి బీఆర్‌ఎస్ క్రియాశీలక సభ్యత్వానికి శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కొండపల్కలలో మాట్లాడారు. రాజకీయ గురువు వెలిచాల జగపతిరావు కుమారుడు రాజేందర్ రావుకు కాంగ్రెస్ నుంచి కరీంనగర్ ఎంపీ టికెట్ రావడంతో ఆయనకు మద్దతుగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇన్నాళ్లు సహకరించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ముస్లిం రిజర్వేషన్‌పై మోదీవి అబద్ధపు మాటలు

కరీంనగర్ కార్పొరేషన్: ముస్లిం రిజర్వేషన్‌ల గురించి ప్రధాని నరేంద్రమోదీ అబద్దాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.తాజొద్దీన్ విమర్శించారు. శనివారం నగరంలోని 54వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా వెనుకబాటును గుర్తించి ముస్లిం తెగలకు రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. ముస్లిం సమాజంలో దాదాపు 60 శాతం వివిధ వృత్తులపై ఆధారపడి ఉన్నారని, 1960 నుంచి వీరిని వెనకబడిన వర్గాల్లో చేర్చాలని డిమాండ్ ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లకు కూడా ముస్లిం రిజర్వేషన్ వల్ల ఇబ్బందులు ఉండవన్నారు. వాస్తవాలను ప్రక్కనపెట్టి మోదీ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

8 మందికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన 8మందికి శనివారం కరీంనగర్ కోర్టు జైలుశిక్ష విధించింది. కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 25 మందిని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా వారిలో ఒకరికి ఏడు రోజులు జైలు, మరొకరికి ఐదు రోజుల జైలు , ఆరుగురికి మూడు రోజుల జైలుశిక్ష, వీరికి రూ. 16,5000 జరిమానా విధించారన్నారు. మిగితా 17 మందికి రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.



- ప్రత్యేకంగా పెద్ద్దు, తొమ్మిదెకరాల్లో ఆహార పంటలు
- యువ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న మురళీ కృష్ణారెడ్డి

పౌల్ట్రీ టు షీప్ ఫార్మింగ్

రామడుగు: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన రైతు ఒంటెల మురళీకృష్ణారెడ్డి ముప్పై ఏళ్ల పాటు బాయిలర్ కోళ్ల పెంపకం చేపట్టి ఇప్పుడు గొర్రెల పెంపకం చేపట్టి నేటి యువ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. బాయిలర్ కోళ్ల పెంపకం చేపట్టిన రైతు ఏడాదిన్నర క్రితం మరో వ్యాపారం చేపట్టాలని ఆలోచించాడు. పౌల్ట్రీఫామ్‌లో ఒక షెడ్డును గొర్రెల పెంపకానికి వినియోగించాలనుకున్నాడు అందుకోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. అందులోనూ తల్లులు, పిల్లలు, పొట్టేళ్లను వేర్వేరుగా ఉంచేందుకు ఏర్పాట్లు చేసి గొర్రెల ఫామ్ ప్రారంభించారు. తొలుత కొద్ది పాటి గొర్రెలను మాత్రమే తీసుకువచ్చాడు. ప్రస్తుతం దాదాపుగా 500 పైగానే గొర్రెలు ఉన్నాయని తెలిపాడు. గొర్రెలకు ఆహారంగా ఫామ్‌లో దాదాపు తొమ్మిది ఎకరాల్లో సూపర్ నెపియర్, సమాట్ నెపియర్, హెజ్‌లుసన్, స్వీట్ పొటాటో, జొన్న ఐదు రకాలు సాగు చేసి వాటికి ఆహారంగా అందజేస్తున్నాడు. నిత్యం రెండు నుంచి మూడు టన్నుల మేత అందజేయడంతోపాటుగా శనగ, పల్లి, కందిపొట్టు అదనంగా సమకూరుస్తున్నట్లు తెలిపాడు. ప్రధానంగా గొర్రెలకు వచ్చే వ్యాధులకు ముందస్తు టీకాలు వేస్తున్నామని మూడు నెలలకోసారి తప్పకుండా నట్టల మందులు తాగించడం, ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన మందులు వేస్తున్నామని వివరించాడు. ఫామ్‌లో పెరుగుతున్న గొర్రెలను ఇప్పటివరకు అమ్మలేదని మరో మూడు మాసాల తర్వాత విక్రయించనున్నట్లు తెలిపారు.

సమస్యలను అధిగమించి



గొర్రెల పెంపకం ప్రారంభించిన తర్వాత చాలా సమస్యలు అధిగమించాను. ఇప్పుడు ఐదువందల వరకు జీవాలను పెంచుతున్నాను. గొర్రెల కోసం చాలా మార్కెట్లు తిరగాల్సి వచ్చింది. వాటిని తీసుకువచ్చిన తర్వాత కొన్నింటికి అనారోగ్య సమస్యలు వచ్చాయి. చికిత్స విధానం తెలుసుకున్నాను. ప్రస్తుతం ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాయి. మరో మూడు నెలల తర్వాత అమ్మకాలు ప్రారంభిస్తాను.

ఒంటెల మురళీకృష్ణారెడ్డి, రైతు–రుద్రారం

మేడే పోస్టర్ ఆవిష్కరణ



శంకరపట్నం: పోస్టర్‌ఆవిష్కరిస్తున్ననాయికులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శనివారం సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య మేడే పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్మికులు మేడే వేడుల్లో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు సదానందం, రవి, వెంకటస్వామి, సంపత్, భిక్షపతి, అలీ, వెంకన్న పాల్గొన్నారు.

టీపీఎఫ్ కరప్రతం ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీపీఎఫ్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా కో కన్వీనర్ అయిందాల అంజి, జిల్లా నాయకుడు మాల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం టీపీఎఫ్ కరప్రతాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం దుర్మార్గ పాలన కొనసాగిస్తుందని, ప్రజల మధ్య అంతరాలు సృష్టించిందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కేంద్రీకరించే విధంగా బీజేపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే సదుస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా సమన్వయ కర్త ఆరెల్లి మల్లగౌడ్, నాయకులు శ్రీపతి కృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు

రామడుగు: ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్ కోసం కష్టపడి చదవాలని రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, ట్రస్మా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాల వార్షికోత్సవం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బండ అజయ్‌రెడ్డి, మాజీ సర్పంచులు పంజాల ప్రమీల, మన్నె దర్శన్‌రావు, పాఠశాల కరస్పాండెంట్ పంజాల జగన్మోహన్‌గౌడ్, శ్రీ ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాక్రిష్ణ, డైరెక్టర్లు ఉప్పుల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పలువురు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు

హుజూరాబాద్: పట్టణంలోని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసంలో శనివారం భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు...పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను ఏ విధంగా మోసం చేస్తుందో ప్రజలు గ్రహించాలని, నాలుగు నెలల్లోనే ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సంగెం ఐలయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక–శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, తొగరు సదానందం, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ , ముత్యంరాజు కుమారస్వామి, రమాదేవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు గడపగడపకూ వెళ్లాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీరామ్‌శ్యామ్

జమ్మికుంట: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలని జమ్మికుంట జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. శనివారం మండలంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బలహీన వర్గాల వ్యక్తిగా ధర్మం, దేశం కోసం పోరాటం చేస్తున్న నాయకుడు బండి సంజయ్ అని, ప్రజా సమస్యలపై పోరాడుతూ పనులు చేస్తున్నారని, ప్రతి కార్యకర్త గడపగడపకూ వెళ్లి బండి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు, ప్రభారి డాక్టర్ పెసరు రామచంద్రారెడ్డి, కర్ర సంజీవరెడ్డి, లింగంపల్లి శంకర్, సంతోష్, ఆకుల రాజేందర్, రమేశ్, రామిడి సురేందర్‌రెడ్డి, ఇల్లందుల రాజమల్లు, రావుల సంపత్, వీరగోని రాజన్న, స్వరూపరాణి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్ కండువా కప్పుకున్న దుబ్బ నీరజ



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రణవ్‌బాబు

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ సమక్షంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు దుబ్బ నీరజ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. తనతోపాటు భాగ్యలక్ష్మి, అశోక్, ఎండీ షకీల్, సాయి చరణ్, రాజు, బాపురెడ్డి పార్టీలో చేరారని ఆమె తెలిపారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి 11వ వార్డు కౌన్సిలర్ దండ శోభ, మాజీ ఎంపీటీసీ దండ విక్రమ్‌రెడ్డిలతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం, రామన్నపల్లికి చెందిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేడిపల్లి మొగిలి, మాజీ ఉప సర్పంచ్ ఓదేలు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకన్న, బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ శ్రీను నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రూ.1.50 లక్షలు పట్టివేత



ఇల్లందకుంట: సిరిసేడు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు శనివారం వా హనాల తనిఖీ చేపట్టారు. సిద్దిపేటకు చెందిన పృథ్వీరాజ్ రూ.1.50 లక్షలు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. సంబంధిత పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపా రు. రూ.50 వేలకు పైగా తీసుకెళ్లేటప్పుడు సంబంధిత ఆధారాలు ఉండాలని పేర్కొన్నారు.

జేసీబీ యజమానికి రూ. 50 వేల జరిమానా

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన జేసీబీ యజమాని శ్రీనివాస్‌కు శనివారం రూ.50 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు. అనుమతి లేకుండా జేసీబీతో తవ్వకాలు చేస్తుండటంతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

కారును ఢీకొన్న బైక్



గన్నేరువరం: కారును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండల కేంద్రానికి చెందిన బాలాజీ దామోదర్ తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో చందుర్తి మండలంలోని రామారావుపల్లెకు చెందిన వడిజ నర్సింగం ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింగం చేయి, తలకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని టోల్‌గేట్ సిబ్బంది 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

నిబంధనల మేరకే తూకం వేయాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మొలంగూర్‌లో హమాలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: ధాన్యంలో కోతలు పెట్టే రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మొలంగూర్ గ్రామంలో శనివారం ఉదయం పర్యటించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. నిబంధనల మేరకే తూకం వేయాలని హమాలీలకు సూచించారు. ఇటీవల మరణించినవారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బస్వయ్య, తిరుపతి, మహేశ్, రమేశ్ తదితరులున్నారు.

రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌దే అధికారం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామం తన ఇంటిలో శనివారం ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌దే అధికారంలోకి వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు.

యువత చూపు బీజేపీ వైపు



హుజూరాబాద్: మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్/చిగురుమామిడి: యువత చూపంత బీజేపీ వైపే ఉందని, కొత్త ఓటర్లంతా ప్రధాని మోదీకి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కి ఓటు వేయాలని నిశ్చయించుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. హుజూరాబాద్ బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం పార్లమెంట్ ఎన్నికల సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ బలంగా ఉందని, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశ ప్రజలంతా పదేళ్ల మోదీ పాలనపై విశ్వాసంతో ఉన్నారని, అందుకే ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రానుందని అనేక సర్వే ఫలితాలు తెలియజేస్తున్నాయన్నారు. బండి సంజయ్‌ను గెలిపించడానికి బీజేవైఎం శ్రేణులు సమష్టిగా కృషి చేయాలన్నారు. హుజూరాబాద్‌లో మే 2న కరీంనగర్ పార్లమెంట్ బీజేవైఎం సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి శౌధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నికేశ్, హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గౌతమ్ రెడ్డి,మండల అధ్యక్షుడు రాముల కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 12వేల కోట్లు మంజూరు

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి రూ.12వేల కోట్లు మంజూరయ్యాయని, బండి సంజయ్‌కుమార్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కృష్ణారెడ్డి కోరారు. చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, బొమ్మనపల్లి గ్రామాల్లో గడపగడపకూ బీజేపీ ప్రచారం నిర్వహించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు ప్రజల ను చైతన్యపరుస్తామని అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే బండి సంజయ్‌పై అర్థం, పర్థంలేని ఆరోపణలు చేయడం సముచితం కాదన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్ స్థాయి మరచి బండి సంజయ్‌కుమార్‌పై అనవసర విమర్శలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మాటలు నమ్మేపరిస్థితిలో ప్రజలు లేరన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్ రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధిశ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు మరళిమనోహర్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెస్సార్‌కు నివాళి



రామడుగు: నివాళి అర్పిస్తున్న మహిళలు

రామడుగు: మండలంలోని వెదిరలో శనివారం టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి అంజయ్య, గుమ్మడి రాము, పోడేటి శంకర్‌గౌడ్, షాబుద్దీన్, శుక్రొద్దీన్, శ్రీహరి, మల్లవ్వ, బుచ్చవ్వ, లక్ష్మీ, దేవేంద్ర, ఎల్లవ్వ పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని కాకతీయ బిల్డింగ్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ జనరల్ సక్రెటరీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు, దివంగత నేత ఎం. సత్యనారాయణరావు(ఎమ్మెస్సార్) వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేశారని ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య, కసుబోజుల వెంకన్న, చిన్నింటి నాగేంద్ర, మైస మహేందర్, కాగితం శ్రీనివాస్, గొట్టి ప్రభుదాస్, రాజమౌళి, మురళి, దీక్షత్, సురేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన బొల్లం శివమ్మ (85) గ్రామంలోని చేదబావిలో పడి మృతి చెందింది. సీఐ మాదాసు రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు..శివమ్మ ఆరు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితంగా లేక తిరుగుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతుకుతుండగా ఇంటికి సమీపంలోని చేదబావిలో శవమై కనిపించింది. మృతురాలి కుమారుడు బొల్లం నారాయణ ఫిర్యాదు మేరకూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: హుజూరాబాద్ శివారు సిర్సపల్లిలోని సర్వే నం 496లో కొందరు మట్టి (మొరం) అక్రమంగా రవాణా చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రావణ్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో మాట్లాడారు. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని దీంతో అక్రమార్కులు ఇష్టానుసారం మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. మట్టి తరలింపుపై తహసీల్దార్, ఆర్డీఓలకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని 2418 సర్వే నెంబర్‌లో అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారని, మున్సిపల్ అధికారులు విచారణ జరిపి ప్రహరీని కూల్చివేశారని మళ్లీ గోడ నిర్మించారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

11 మంది బైండోవర్

మానకొండూర్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 11 మంది బెల్టు షాపు నిర్వాహకులు, పాతనేరస్తులను శనివారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మద్యం పట్టివేత

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి వద్ద రూ.2,400 విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.